గీత కార్మికుడి కుటుబానికి అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

దవాఖానలో చికిత్స పొందుతున్న మల్లయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

బొమ్మలరామారం, డిసెంబర్ 21 : మండలంలోని బండకాడిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోనాల మల్లయ్య ఇటీవల తాటి చెట్టు పైనుంచి జారి పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లయ్యను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గీత కార్మికుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్, బూడిద శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

పాఠశాలను తెరిపించాలని ఎంఈఓ మహదేవరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 21 : మండలంలోని లింగరాజుపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల మూతపడగా.. ఈ నెల 20న 'విద్యార్థులు లేక పాఠశాల మూత' శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దాంతో డీఈఓ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి శనివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాల మూతపడడంతో విద్యార్థులు పక్క గ్రామానికి వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి పాఠశాలను తెరిపించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు రాసి ఇచ్చారు. ఉన్నతాధికారులకు వివరించి త్వరలోనే మూతపడిన పాఠశాలను తెరిపించేలా కృషి చేస్తానని ఎంఈఓ తెలిపారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం దామోదర్, గ్రామస్తులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి గణితంలో రాణించాలి : ఎంఈఓ

రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ గురువారావు

చౌటుప్పల్, డిసెంబర్ 21 : ప్రతి విద్యార్థి డాక్టర్ శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని గణితంలో రాణించాలని ఎంఈఓ గురువారావు అన్నారు. పట్టణంలోని ట్రినిటీ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ గణిత దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు రామానుజన్ ఆప్టిట్యూట్ టెస్ట్‌ను ప్రారంభించారు. నిత్య జీవితంలో గణితానికి ఉన్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. ప్రపంచ ధ్యాన దినోత్సవంలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన ధ్యాన సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడొద్దు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాజస్టీస్, అధ్యాపకులు

మోత్కూరు, డిసెంబర్ 21 : విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడి భవిష్యత్తును ఆగం చేసుకోవద్దని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రభాజస్టీస్ అన్నారు. కళాశాలలో శనివారం సాంస్కృతిక కళాజాత బృందం ఆధ్వర్యంలో ఆటాపాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గంజాయి, సిగరెట్, మత్తు చాక్‌లెట్లను విద్యార్థులు తీసుకోవద్దన్నారు. మత్తు పదర్థాల వల్ల ఆరోగ్యం పాడు కావడంతోపాటు చెడు వ్యసనాల బారిన పడుతారని తెలిపారు. పీడీ కడారు నర్సింహారెడ్డి, అధ్యాపకుడు అంజయ్య, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

27నుంచి ఊరూరా ఆరోగ్య సమ్మేళనాలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి

బీబీనగర్, డిసెంబర్ 21 : ఇంటింటా ఆరోగ్యం.. దేశానికే సౌభాగ్యం' నినాదంతో ఈ నెల 27నుంచి నాలుగు రోజుల పాటు ఊరూరా ఆరోగ్య సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ కేవీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పాఠశాలలో శనివారం ఊరూరా ఆరోగ్య సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు ప్రకృతి వైద్య నిపుణులు కేవై రామచంద్రా రావు సహకారంతో గ్రామాల్లో ఆరోగ్య సైన్స్ ఫేర్‌లు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతో రోగ నిరోధకశక్తి పెంపు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21 : పిల్లలకు పౌష్టికాహారంతో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మ అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో భాగంగా శనివారం తెలంగాణ ఆహారోత్సవ కార్యక్రమాన్ని బంజారాహిల్స్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.రాజిరెడ్డి, జి.శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగానే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు

వలిగొండ, డిసెంబర్ 21 : మాజీ మంత్రి కేటీఆర్‌ను ఫార్ములా ఈ కారు రేస్ పేరుతో కేసులో ఇరికించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను మానుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు డేగల పాండరి అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయడం చేతగాక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేటీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు దిగుతుందన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు సహించరని, తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

జనవరి 3నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రికెట్ పోటీలు

మోత్కూరు, డిసెంబర్ 21 : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో జనవరి 3నుంచి 13వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎండీ జాకీర్, సీహెచ్ నరేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.25వేలతోపాటు షీల్డ్, రెండో బహుమతి రూ.15వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ టీమ్ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రింటెడ్ వస్ర్తాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం

- కేంద్ర చేనేత, జౌళి శాఖ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ నిపుణ్ పాండే

దుకాణం నుంచి తెచ్చిన ప్రింటెడ్ వస్ర్తాలను పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 21 : పోచంపల్లి ఇక్కత్ డిజైన్లతో ప్రింటెడ్ వస్ర్తాలు తయారు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర చేనేత, జౌళి శాఖ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ నిపుణ్ పాండే అన్నారు. చేనేత కార్మికుల స్థితిగతులు, వారి జీవన విధానం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు రాష్ట్ర వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలు, వాటి వినియోగం, కళాకారుల పనితీరును పరిశీలించారు. శ్రీరంజన్ సిల్క్ యూనిట్‌లో సిల్క్ తయారీ, ఆసు మిషన్ పనితీరు, రంగుల అద్దకం, డిజైన్ చుట్టే విధానం, చేనేత మగ్గాలు, చేనేత వస్ర్తాలు, డిజైన్లను పరిశీలించారు. చేనేత కార్మికుల ఇండ్లకు వెళ్లి మగ్గాలపై వస్ర్తాల తయారీ, మార్కెటింగ్, కార్మికుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టై అండ్ డై అసోసియేషన్‌లో చేనేత వ్యాపారులు, కార్మికులు, కళాకారులతో సమావేశమయ్యారు. ప్రింటింగ్ వస్ర్తాలను నియంత్రించాలని టై అండ్ డై అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. చేనేతకు కేటాయించిన టై అండ్ డై పోచంపల్లి ఇక్కత్ డిజైన్లతో ప్రింటెడ్ వస్ర్తాలు తయారవుతున్నాయని, మార్కెట్లో అవి అతి తక్కువగా లభించడంతో చేనేత వ్యాపారులు నష్టపోతున్నారని తెలిపారు. ఉపాధి లేక కార్మికులు వలసలు వెళ్లే దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కేంద్ర అధికారి ఉన్నతాధికారులతో చర్చించి ప్రింటెడ్ వస్ర్తాలు తయారు చేస్తున్న కంపెనీలపై చట్టపరంగా చర్యలు చేపడుతామన్నారు. హ్యాండ్లూమ్ మార్క్‌తో చేనేత వస్ర్తాలు విక్రయించాలని సూచించారు. వ్యాపారులకు రుణాలతోపాటు ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

సమావేశంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, ఉపాధ్యక్షుడు ఈపూరి ముత్యాలు, కుడికాల రామనరసింహ, నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

యాదగిరిగుట్ట : ధ్యానం చేస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 21 : ధ్యానంతో మానసిక ప్రశాంతత కలుగడంతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాకుడు రవిశంకర్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం పురస్కరించుకొని శనివారం తన శిష్య బృందంతోపాటు పోలీస్ అధికారి ఆర్ఐ శ్రీనివాస్ సమక్షంలో మండలంలోని సైదాపురం రాచకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో ఆసనాలు వేయించారు. ప్రతినిధులు రవి, బాలయ్య, వెంకటనరసింహారెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని మార్కండేయస్వామి దేవాలయంలో రాజరాజేశ్వరి ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, మార్కండేశ్వర దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, పద్మశాలీ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగంశాస్త్రి, ఆధ్యాత్మిక మండలి అధ్యక్షుడు తుకారాం, లత పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని పల్లివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో జ్ఞాన దినోత్సవం నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పాఠశాల ఇన్‌చార్జి ఘశీరాం, రఘురాంరెడ్డి, నిర్మల, హరికిషన్, జయశ్రీ, కృష్ణ, భూపాల్, లలిత, మధుబాబు పాల్గొన్నారు.

రామన్నపేట : పల్లివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

భూదాన్ పోచంపల్లిలో ధ్యానంలో పాల్గొన్న ప్రతినిధులు

ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ధ్యానం అవసరం

- బీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

ఎయిమ్స్‌లో ధ్యానం చేస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, డాక్టర్లు

బీబీనగర్, డిసెంబర్ 21 : ఆధ్యాత్మిక భావోద్వేగ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ధ్యానం దినచర్యలో భాగం కావాలని, అది ఎంతో అవసరమని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ ధ్యాన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి ధ్యానం ఎంతో అవసరమని, అందరూ ధ్యానాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దవాఖానలో డాక్టర్లతో కలిసి ధ్యానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సంగీత, నితిన్ జాన్, గోవింద్‌రావు, వందన తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 21 : అడ్డదారుల్లో సంపాదనకు అలవాటుపడి మట్టిని తోడి ఫిల్టర్ చేసి కృత్రిమ ఇసుకను తయారు చేస్తే కఠిన చర్యలు తీసకుంటామని ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యానాయక్ అన్నారు. మండలంలోని మాసాయిపేట, మైలారిగూడెం గ్రామాల్లో వాగు వెంట మట్టిని తోడి ఇసుక తయారు చేసిన ప్రాంతాలను పోలీస్ అధికారులు, ఆర్ఐతో కలిసి శనివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలపై ఉపేక్షించేది లేదన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో నిఘా పెడుతున్నట్లు తెలిపారు. మట్టిని తోడి ఇసుకను తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ మోటార్ల వైరు చోరీ

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 21 : మండలంలోని రెడ్డినాయక్‌తండా గ్రామంలోని గిరిజన రైతుల వ్యవసాయ మోటార్ల వైరును గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి అపహరించుకుపోయారు. బాధిత రైతులు భూక్యా బిక్నా, సీతారాం, ధీరావత్ బిక్నా, శ్రీరాం, వెంకటేశ్, జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చూడగా బోరు మోటార్లు, కరెంట్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌ఓ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

మోత్కూరు ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

మోత్కూరు, డిసెంబర్ 21 : విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంచుకోవాలని మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవినేని అరవిందరాయుడు అన్నారు. పాఠశాలలో శనివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు చదువులో రాణించాలని ఆయన అన్నారు. గణిత ఉపాధ్యాయులను సన్మానించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- మున్సిపల్ చైర్మన్ రాజు


భూదాన్ పోచంపల్లిలో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు

చౌటుప్పల్, డిసెంబర్ 21 : భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. వలిగొండ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇంద్రసేనారెడ్డి, దేవేందర్, నర్సింహగౌడ్, బాలకృష్ణగౌడ్, కరీం, రమేశ్‌గౌడ్, వెంకటేశ్ మహజన్, సాయిలు, శ్రీనాథ్, భార్గవ్, లింగస్వామి, రామచంద్రం, నర్సింహ, సుందర్, శ్యామ్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

రామన్నపేట : రాజ్యసభలో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సుభాశ్ సెంటర్‌లో శనివారం నిరసన తెలిపి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బల్గూరి అంజయ్య, కల్లూరి నగేశ్, కందుల హన్మంతు, బాలరాజు, సోములు, ఉపేందర్, లెనిన్, సత్యం, ఉదయ్‌కుమార్, రామచంద్రం, వెంకటేశం పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని నేతాజీ చౌరస్తా వద్ద దళిత సంఘాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బసవయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నల్ల నాగేశ్, నాయకులు పాల్గొన్నారు.


చౌటుప్పల్‌లో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు


రామన్నపేట : అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ముగిసిన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 21 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 16న ప్రారంభమైన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ పోటీల్లో వాలీబాల్ బాలుర విభాగంలో తుర్కపల్లి మండలం ప్రథమ, మోటకొండూర్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో మోటకొండూర్ ప్రథమ, ఆలేరు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. కబడ్డీ బాలుర విభాగంలో బీబీనగర్ మండలం ప్రథమ, భువనగిరి పట్టణం ద్వితీయ, బాలికల విభాగంలో బొమ్మలరామారం మండలం ప్రథమ, తుర్కపల్లి మండలం ద్వితీయ ఖోఖో బాలుర విభాగంలో యాదగిరిగుట్ట మండలం ప్రథమ, బొమ్మలరామారం ద్వితీయ, బాలికల విభాగంలో భువనగిరి పట్టణం ప్రథమ, వలిగొండ మండలం ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు మెమెంటోలు, మెరిట్ సర్టిఫికెట్లు, ఫీల్డ్‌లు, మెడల్స్ అందజేశారు. అథ్లెటిక్స్ పోటీల్లో తుర్కపల్లి మండలం క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతి పొందారు. ప్రతిభ కనబరిచిన వారిని అదనపు కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మున్సిపల్ కమిషనర్ పి.రామాంజనేయులు, జిల్లా క్రీడల అధికారి ధనుంజనేయులు అభినందించారు.

పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలి

- బీబీనగర్ ఎయిమ్స్‌లో క్యాన్సర్ బాధితులకు శస్త్రచికిత్స పూర్తి
- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, డిసెంబర్ 21 : పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. హెడ్ అండ్ నెక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఇద్దరికి స్వరపేటిక క్యాన్సర్ కేసులకు గత వారం నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని ఆయన తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీబీనగర్‌తోపాటు నల్లగొండకు చెందిన ఇద్దరు రోగులకు స్వరపేటిక క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి వాయిస్‌లో మార్పులు రావడం, శ్వాస తీసుకోవడం, ఆహారాన్ని మింగడంలో ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. ఈ క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం పొగాకు వాడకం, ధూమపానం, పొగాకు నమలడం, ఆల్కహాల్ వినియోగం అన్నారు. ఈ వ్యాధి వల్ల నోరు బొంగురుపోవడం, వాయిస్‌లో మార్పులు, మింగడంలో ఇబ్బంది లేదా గొంతులో ఏదో ఇరుక్కుపోయిన అనుభూతి, నిరంతరం గొంతు లేదా చెవి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు లేదా శబ్దంతో కూడిన శ్వాస వంటి లక్షణాలను గుర్తించవచ్చన్నారు. సర్జన్ల బృందం, హెడ్ అండ్ నెక్ శస్త్రచికిత్స డాక్టర్ నమిత్‌కాంత్ సింగ్, డాక్టర్ నీము హేగే, డాక్టర్ ఆర్ బాలాజీ బృందం శస్త్ర చికిత్స చేసి స్వరపేటికను తొలగించారని తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

చీకటిమామిడి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్

బొమ్మలరామారం, డిసెంబర్ 21 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత పాటించాలని సమగ్ర శిక్షా జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ అన్నారు. మండలంలోని చీకటిమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటనూనెలు, కూరగాయలను పరిశీలించారు. భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. జీహెచ్‌ఎం ఉపేంద్ర, ఉపాధ్యాయులు, భోజన కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బహుమతి గెలుచుకున్న మోడల్ స్కూల్ విద్యార్థినులు

వలిగొండ, డిసెంబర్ 21 : సీఎం కప్-24 క్రీడోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలికల ఖోఖో పోటీల్లో మండలంలోని లోతుకుంట గ్రామ మోడల్ స్కూల్ విద్యార్థినులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ రహీమున్నీసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఐలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు పాముకుంట విద్యార్థినులు

సాహితి

అనూష

రాజాపేట, డిసెంబర్ 21 : సీఎం కప్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు పాముకుంట ఉన్నత పాఠశాల విద్యార్థినులు రెడ్డిబోయిన సాహితి, గొడుగు మనూష ఎంపికైనట్లు ఎంఈఓ చందా రమేశ్ తెలిపారు. భువనగిరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 23నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్న విద్యార్థినులను ఎంఈఓ చందా రమేశ్, ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ పి.మధు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎ.ప్రభ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు చిన్నకొండూరు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 21 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కె.యాదగిరిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన ఎం.ప్రణీత, చెక్క శివాని, బి.మహాలక్ష్మి ఎంపికయ్యారు. పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కె.యాదగిరి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉజ్జిని కవిత అభినందించారు.

జనవరి 1నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా ఏపీజీవీబీ


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 21 : కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు 2025 జనవరి 1నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని ఆత్మకూరు(ఎం) బ్రాంచి మేనేజర్ ప్రశాంత్ కుమార్ అన్నారు. బ్యాంకులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలో అత్యధిక బ్రాంచీలు ఉన్న బ్యాంకుగా మారనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంకులను అనుసంధానం చేసి ప్రతి రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంకు ఉండేలా చర్యలు తీసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు చేసే క్రమంలో ఈ నెల 28నుంచి 31వరకు బ్యాంకింగ్ సేవలు పూర్తిగా ఆగిపోనున్నాయని తెలిపారు. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఫోన్‌పే, గూగుల్ పే సేవలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు. ఈ నెల 27లోపు బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించుకోవాలని సూచించారు.